ఎప్పుడూ ఇంతేనా

పక్కింటి వాచీ అప్పుడే నాలుగు గంటలు కొట్టింది. "సుందీ" అని అత్తగారి పిలుపు గుండెలమీద కొట్టినట్లు వినిపించింది సుందరికి. ఆ వెనువెంటనే రామీ, సీతా, లేవండి నాలుగయింది అని అత్తగారు తన తోడి-కోడళ్లను పిలవడము వినిపించింది. ఇక ఎలాగ తప్పదని లేచి బైటకొచ్చింది. ఇంకా చీకటి దట్టముగా వుంది. ఎక్కడా చీమ చిటుక్కుమన్న ధ్వనైనా లేదు. తను తప్ప మిగతా ప్రపంచమంతా నిద్రపోతున్నట్లున్నాది సుందరికి. అవును వుండువంటి చలికాలంలో అంత చీకటిలో ఎవరు లేస్తారు. తుదకు తన తోడికోడళ్లైనా లేవలేదు. అత్తగారు మళ్లా తెలివి తెచ్చుకొని పేరుపేరునా కోడళ్లను లేపింది. వెంటనే చిన్న కోడలు గదిలోంచి పిల్లవాని ఏడుపు. పెద్దకోడలు గదిలోంచి మూలుగు విన్పించాయి సుందరికి.

ఇది రోజూవున్న మామూలే. పెద్దకోడలు రామమ్మ సుస్తీ మనిషి, ఇంత చీకటితో లేచి పని చేయలేదు. అసలు ఆవిడ ఎప్పుడైనా పనిపాట్లు చేసి వుంటేగా! ఆవిడ ఏమాత్రం పనిచేసినా "వళ్లు అలిసి మొదటికొస్తేకాని వూరుకోవని" - పెద్దాయన కేకలేస్తారు. సీత చంటిపిల్ల తల్లి. ప్రక్కలోంచిలేస్తే పిల్ల వూరుకోదు. ఇక మిగిలిదల్లా సుందరి ఒక్కతే అత్తగారి పిలుపువిని లేవ్వలసింది. అత్తగారు మాత్రం ముగ్గురినీ నోరారా పిలుస్తుంది. మహా లేచిపోతూన్నట్లు ఇదంతా ఇరుగు పొరుగుల వాళ్ళు విని ముగ్గురునీ సమంగా చూస్తున్నాదనుకోవాలనీ. పెద్దకోడలు రామమ్మ ఆమెకి అన్న కూతురు. సారె, చీరె చాలా తెచ్చింది. చిన్నకోడలు సీత తమ్ముని కూతురు. ఒక్కత్తే ఆడపిల్ల తమ్మునికి. అతని తదనంతరము చాలా ఆస్తి కలుస్తుంది సీతకి. సుందరి మాత్రం పైపిల్ల. సుందరి పుట్టింటివారు అట్టే భాగ్యవంతులుకారు. అందుచే ముద్దు ముచ్చటా సరిగా జరగలేదని కోపం అత్తగారికి. వీలయినంతవరకు ఆ యిద్దరి కోడళ్లను వెనకేసుకురావడము సుందరిని కేకలెయ్యడము అత్తగారి వంతు. కాని అది లోకానికి తెలియకుండా వుండాలని గట్టిగా నోరు బ్రద్దలయేలాగ ముగ్గురికీ పనులు పురమాయిస్తూంటుంది.

తెల్లారగట్ట నాలుగు గంటలకి లేచిన సుందరికి రాత్రి పదయినా పడుక్కొనేందుకు వీలుండదు. లేచింది మొదలు చెయ్యి ఆపకుండా ఎద్దులా పాటుపాడాలి. ఇంతా చేస్తే చివరికి దక్కేవి అత్తగారిచే చీవాట్లు, తోడికోడళ్ల సాధింపులు. ఇవన్నీ ఎలాగైనా భరించగలదు కాని, ఈ విషయాలలో మొగవారుకూడా జోక్యము కల్గించుకోవడము సహించలేకపోతున్నాది.

ఒకరోజున ఇంట్లో ఏదో పితృకార్యము పచ్చింది. సుందరి మడి కట్టుకొని వంటచేస్తున్నాది. ఇంతలో ఇంటికి ఎవరో చుట్టాలొచ్చేరు. వారికి కాఫీ, ఫలహారములు తయారుచెయ్యడానికి వచ్చింది పెద్ద కోడలు. చిన్నావిడ పిల్లలకి అన్నాలు పెడుతున్నాది.ఇంతలో చంటివాడు మంచము మీదనుండి దొర్లి కిందపడ్డాడు. ఇక ఏముంది! ఒకటే గోల. దానితో చిన్నాయన చెల్లు, బుస్సుమన్నారు. పిల్లాడినొక్కడినీ ఎందుకు విడిచిపెట్టావనీ, నువ్వీ యింట్లో చాకిరీ చేయడానికే వచ్చావా అనీ, తతిమ్మా వాళ్ళంతా ఏమి చేస్తున్నారనీ, ఒకటేమిటి అవి, ఇవీ అన్నీ కలిపి భార్యను కేకలేసేరు. ఎవరుమాత్రం తక్కువ తిన్నారని ఇక పెద్దాయన లేచారు. "నా పెళ్లాం జబ్బు మనిషి! అయినా ! చచ్చీ, చెడీ పని చేస్తూనేవుంటుంది. ఇలా చాకిరీ చేస్తూంటే అది ఇక అట్టే కాలం తిరిగేలా కన్పించడం లేదు. ఈ ఇంట్లో ఎవరికీ జాలీ, అభిమానము లేదు. అయ్యో! జబ్బు మనిషి, దాని చేత పనిచేయించడమేమిటి. దానికి సరిగా మందూ మాకూ చూసి పథ్యపానాలు చేద్దామన్న సంగతి ఎవరికీ తోచదు. ఇదిగో ఇప్పుడే చెప్తున్నాను. ఈ రోజు నుంచి దానివంతు పనిపాట్లు నేను చేస్తాను. దానిని ఎవరూ పల్లెత్తుమాట అనడానికి వల్లకాదు. అది మంచంమీద నుండి కాలుక్రింద పెట్టదు. తెలిసిందా?" అని తమ్ముని కన్న రెట్టింపు గొంతుకతో కేకలేసాడు.

ఈ గందరగోళం ఏమిటా అని ఇంటిలోనుంచి బైటకొచ్చింది సుందరి. సుందరిని చూడగానే అత్తగారు దీర్ఘాలు తీస్తూ "ముసలిముండను, కాటికి కాళ్లు జాచుకున్న నా మీద విరుచుకు పడతారెందుకు? చీకటుండగా లేచి పడుక్కొనే దాక వొంచిం నడుమెత్తకుండా

చాకిరీ చేస్తున్నాను. అంతా తినేవారేకాని పనిచేసేవారు ఒకరూ లేరాయే. ఇంతకీ మిమ్ములననవలసిన పనేమిటి. ఇదంతా నా కర్మం కాకుంటే పువ్వుల్లో పెట్టి పూజించే ఆ మహారాజు పోవడమేమిటి! నేనిలా మొద్దులా బ్రతికుండడమేమిటి! బ్రతికున్నందుకు మా బాగా వుంది. పట్టెడన్నముకొరకు ఇన్ని మాటలు, ఇంత చాకిరీ" అని బుడబుడ రాగాలు మొదలుపెట్టింది.

ఈ మహాప్రళయమంతా తనమీదేనని సుందరికి ముందే తెలిసింది. పరధ్యానంగా ఎదురుగుండావున్న తన గదివైపు చూచింది. రామారావు ఈజీ ఛైరులో కూర్చొని ఏదో పత్రిక తిరుగవేస్తున్నాడు. ఇవతల ఇంత గందరగోళం జరుగుతున్నా ఏమి అంటనట్లున్న భర్త మనస్తత్వం చూస్తే సుందరికి ఏమీ ఆశ్చర్యం కలగలేదు. నేటికి రెండేళ్లయి చూస్తూనేవుంది. ఎప్పుడూ అతను ఇంతే. అలాగని రామారావుకి సుందరిపై అభిమానము లేదని చెప్పలేము. కాని అతను అస్వతంత్రుడు. భార్యను వెనకేసుకొని అన్నగార్లతోను, తల్లితోనూ దెబ్బలాడేపాటి ధైర్యము లేదు. ఆ అనువు చూసి తోడికోడళ్లు సుందరిని ఈసడిస్తూంటారు. వారి మాటలు పడలేక సుందరిక ఒక్కొక్కప్పుడు కళ్లనీళ్లపర్యంతమయేది. కాని ఏమీ చేస్తుంది. తన భర్తకేలేని స్వాతంత్రత తన కెక్కడిది? ఇలా చాకిరీ చేస్తూ వీరిచేత తిట్లు, చీవాట్లూ తింటూ బ్రతకవలసిందేనా? తనకీ జీవితానికిక సుఖపడే యోగంలేదా అని విచారిస్తూండేది. తనూతోడివారిలా పిల్లాపాపా కనుక్కొని భర్తతో కులాసాగా కాపురము చేసే సమయమెన్నటికయినా రాదా అని తిరిగి ధైర్యము తెచ్చుకొనేది.

ఏమయితేనేమి! సుందరి దినచర్యలో ఏమాత్రము మార్పు లేకుండానే రెండేళ్ళు గడిచిపోయాయి. రామారావు ఇప్పుడు ఏదో ఆఫీసులో గుమాస్తాగా పని చేస్తున్నాడు. నెలకి డెబ్బయి రూపాయలు జీతం తెస్తున్నా ఇంటిలో అతని స్థానం పూర్వంలాగే వుంది. వీరిలోనుంచి వేరుపడే మార్గము లేదు. ఇక ఈ ఇంట్లో స్వతంత్రముగా వ్యవహరించే అవకాశము లేదు. రామారావు సంగతే ఇలా వున్నపుడింక సుందరి గురించి చెప్పేదేమిటి? తన భర్తకి వుద్యోగమయేకయినా హాయిగా వుండొచ్చని ఇదివరకు ఆశించింది. అది పట్టి

ఆడియాసేయని తేలిపోయింది. ఒక మృత్యువుతప్ప తనని ఈ బాధల నుండి వేరు చేయడానికి ఎవరికి అవకాశములేదని విచారించేది. ఇదంతా తన పూర్వజన్మలో చేసుకొన్న పాపమే; లేకుంటే తనకి చిన్న కోడలులా పిల్లలేనా పుట్టకూడదా? ఏమిటో పిల్లలంటే కష్టమనుకుంటాము కాని అదీ ఒకందుకు మంచిదే. పిల్లలేడుస్తున్నారనైనా ఒక ఘడియ నడుము వాల్చవచ్చు. అత్తింటివారికి కోడలుపై దయలేక పోయినా, పిల్లల మీద ప్రేమచేతైనా తల్లిని బాగా చూస్తారంటారు పెద్దలు. తనకి ఆ యోగం ఇక లేనట్టేవుంది. పోనీ అధమపక్షం పెద్దకోడలులా వళ్లుకందని రోగమేనావస్తే బాగుండును. ఏదో విధంగా తనని ఈ బాధలనుండి తప్పింపమని భగవంతుని ప్రార్థించేది.

సుందరి ప్రార్థనే ఒక విధంగా భగవంతుడు మన్నించేడు. తొమ్మిది నెలలూ మోసి పనసపండంటి పిల్లాడిని కన్నాది సుందరి. వచ్చీ పోయే బంధువులు పిల్లడిని చూచి నిజంగా సుందరి అదృష్టవంతురాలని పొగిడేవారు. ఇంట్లోవారు కూడా ఈసడింపుమాని సరదాగా మాట్లాడుతున్నారు. పగటివేళ పెళ్ళాముతో మాటాడనైనా మాట్లాడని రామారావు గంటకొకమారు ఏదో పని కల్పించుకొని గదిలోకొచ్చి తల్లీపిల్లా యోగక్షేమాలు కనుక్కుంటున్నాడు. పురిటి ఇరవైరోజులు కాలుమీద కాలువేసుకొని రాణిలా కూర్చుంది సుందరి. తనకి జ్ఞానమొచ్చిన తరువాత ఇంత విశ్రాంతిగా ఇంత సంతోషంగా ఎప్పుడును తను వుండలేదనుకొంది. ఇక తనకి కష్టదినాలన్నీ తీరిపోయాయనుకొంది. తనూ చిన్న కోడలిలా తెల్లారి పిల్లాడిని చంక నేసుకొని లేవచ్చు అనుకుంది. ఇంకా పిల్లలు లేరా అని ఇదివరకు తన వంక హేళనగా చూసేవారికందరికీ పండంటి తన కొడుకుని చూపించొచ్చు. తనూ వారికేమి తక్కువ కాదనీ, పాపాయిని ఆడిస్తూ, పాలిస్తూ రోజొక క్షణంలా గడపవచ్చు. ఇక తనతో ఎవరు మాట్లాడకపోయినా లోటులేదు. ఇలాటి ఆలోచనలతోనే ఇరవై రోజులు ఇట్టే గడిచిపోయాయి సుందరికి. సుందరి తల్లి తండ్రీ వచ్చేరు. ఇరవై ఒకటవరోజుని బారసాల చేయడానికి నిశ్చయించేరు. కొంతమంది బంధువులు కూడా వచ్చేరు. వుదయాన్నే తలంటుకొని సుందరి తల్లిదండ్రులు తెచ్చిన

కొత్తబట్టలు కట్టుకున్నారు సుందరీ, రామారావులు. పురోహితుడు మంత్రాలు చదివి విఘ్నేశ్వర పూజా వగైరా తంతంతా నడిపించేడు. పిల్లాడికి ఆనందరావని నామకరణము చేసేరు. తాతగారు ఒత్తులూ, నాయనమ్మ గొలుసూ పెట్టారు పిల్లాడికి. రెండు మూడురోజులలో వచ్చిన బంధువులంతా వెళ్లిపోయేరు. తిరిగి స్వజనులే మిగిలేరు.

అట్టే ఆర్భాటాలు లేకుండా నెలరోజులు గడిచిపోయాయి. భగవంతుడా! ఈ నాటికయినా శాంతించిందికదా! ఈ గృహసంగ్రామమని ఆనందించేడు రామారావు. కాని ఆ సంతోషం అట్టే రోజులు నిలవలేదు. సుందరికి రెండు రోజులు జ్వరం రావడంతో మరల ప్రారంభమయింది సంఘర్షణ. ఈ చాకిరీ నేను చేయలేనని అత్తగారూ, నా పెళ్లాము రోగిష్టిదని పెద్దాయన, నా పిల్లలూరుకోరని చిన్న కోడలు. సుందరికి జ్వరము తగ్గి పథ్యము తిన్నది లగాయతు మళ్లా మొదలయింది కార్యక్రమం. ఎవరి పిల్లల్ని వారు పెట్టుకొని కూర్చుంటే పనులెలాగవుతాయని అత్తగారు, నిద్రపోతూన్న పిల్లాడిని కోరి లేపడమెందుకని తోడికోడలు. అది సుందరి అదృష్టమో, దురదృష్టమో కాని పాలకైనా లేచి ఏడవడు పాపాయి. తనూ చిన్న కోడలులా చంటి పిల్ల తల్లే. అయినా తన పిల్లడు ఏడ్వడు కాబట్టి పూర్వం లాగే చీకటితో లేవవలసిందే! రాత్రి పది అయిందాకా ఇంటి చాకిరీ అంతా చేయవలసిందే. అత్తగారు పిల్చేసరికల్లా అలారం పెట్టినట్లు ఎలా ఏడుస్తాడా ఆ పిల్లడు (చిన్న కోడలు కొడుకు) అని ఆశ్చర్యపోయింది సుందరి. ఈ మాటే భర్తతో అంటే "బుగ్గ చిక్కితే సరి" అన్నాడు "అయ్యో బాబోయి లేవమోస్తుందని - చంటి పిల్లాడిని కోరి ఏడ్పించడమా! నా తండ్రీ! నేనలా ఎన్నడూ చేయనమ్మా, నాకు బాధ తప్పుతుందని నిన్ను బాధపెట్టనులే" అన్నాది వుయ్యాలోవున్న పాప వేపు చూస్తూ సుందరి. "అమ్మా! ఈ బాధలు నీకెన్నాళ్లులే, నేపెద్దవాడినవుతున్నాను కదా? నిన్ను సుఖపెడతానన్నట్లు" చిరునవ్వు నవ్వేడు చిన్న పాపాయి.

– సెప్టెంబర్, 1953, గృహలక్ష్మి